ఆరు మండలాలకు ఒక్కరే..!

- వేధిస్తున్న ఎంఈఓల కొరత
- పాఠశాలలపై పర్యవేక్షణ కరువు
- ఎంఈఓలను నియమించాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు


మండల వనరుల కేంద్రం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు త్రిపురారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలపై పర్యవేక్షణ కరువైంది. ఆరు మండలాల్లో విద్యాధికారుల పోస్టులు కొన్నేళ్లుగా ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జ్ ఎంఈఓలతో నెట్టు కొస్తున్నారు. దీని ఫలితంగా విద్యా వ్యవస్థ పూర్తిగా గాడితప్పుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులపై పర్యవేక్షణ కొరవడింది. ఇక ప్రైవేటు పాఠశాలల గురించి పట్టించుకునే వారు పూర్తిగా కరువయ్యారు.

ఏళ్లతరబడి ఖాళీగా..

నియోజకవర్గంలోని దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, మాడుగులపల్లి, మిర్యాలగూడ మండలంతో పాటు మున్సిపాలిటీ, అదే విధంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండలాల్లో ప్రాథమిక పాఠశాలలు 207, ప్రాథమికోన్నత పాఠశాలలు 25, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 43 ఉన్నాయి. వీటికి అదనంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలు ఉండగా ఆయా పాఠశాలల్లో సుమారు 10వేల నుంచి 15వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. బడులను పర్యవేక్షించాలంటే ప్రతి మండలానికి విద్యాధికారి చాలా అవసరం. ఏళ్లతరబడి ఈ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం దామరచర్ల మండలంలో పని చేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా మాలోతు బాలాజీనాయక్ వేములపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, త్రిపురారం, మాడుగులపల్లి మండలాలకు ఎంఈఓగా ఉన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం

ప్రైవేటు పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మరింత ఎక్కువగా ఉంటుంది. పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, వంటివి పాఠశాలల్లో విక్రయించవద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరుతో వేలాది రూపాయలను ముక్కుపిండి వసూలు చేస్తున్న. కొన్ని ప్రైవేటు పాఠశాలల అనుమతి లేకున్న నడిపిస్తున్నారు. దీంతో వారిని ప్రశ్నించే వారు కరువయ్యారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మౌలికవసతులు లేకున్నప్పటికీ కొనసాగిస్తున్నారు. వీటిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు సతమతం అవుతున్నారు.

ఎంఈఓలను నియమించాలి



ఆరు మండలాలకు ఒక్కరు మాత్రమే ఎంఈఓ ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ లోపిస్తుంది. ఒక్కరు ఆరు మండలాలకు ఇన్‌చార్జ్‌గా ఉండటంతో ఏ మండలానికి కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేదు. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఎంఈఓలను డిప్యూటీ డీఈఓలుగా పదోన్నతులు కల్పిస్తే వారి స్థానంలో పూర్తి స్థాయిలో ఎంఈఓలను నియమించవచ్చు. దీంతో విద్య పూర్తి స్థాయిలో మెరుగుపడుతుంది.

- చిల్లంచర్ల అభిరామ్, మిర్యాలగూడ

పర్యవేక్షణ లోపిస్తుంది



ప్రస్తుతం ఐదారు మండలాలకు ఒక్క ఎఫ్ఏసీ హెడ్మాస్టర్ ఉండటంతో పర్యవేక్షణ లోపిస్తుంది. దీంతో పాటు ఒకే హెడ్మాస్టర్ ఐదారు మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓ పనిచేయడంతో ఒత్తిడికి లోనవుతున్నారు. కామన్ సర్వీసు విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని రెగ్యులర్ ఎంఈఓను నియమించి విద్యావస్థను మెరుగుపరచాలి.

- నాగవెల్లి ఉపేందర్, ఉపాధ్యాయుడు

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి వాటిలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెమడాల పరుశురాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేవీపీఎస్ అధ్యాయన యాత్రలో భాగంగా పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను సందర్శించారు. అనంతరం విద్యార్థులను వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతుఆన్నయన్నారు. అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ వాటిలో సొంత భవనాలను నిర్మించకుండా ఉండటంతో అనేక మంది భూములను ఆక్రమించుకుంటున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుకోవడానికి హాస్టళ్లకు వస్తే అద్దె భవనాల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోడిరెక్క మల్లయ్య, విద్యార్థులు సావిత్రి, రూపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి


మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వీర శేఖర్

త్రిపురారం : విద్యార్థుల తమ కంటు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు కృషిచేయాలని, ఆత్మస్థైర్యమే ఆయుధం లాంటిదని త్రిపురారం ఎస్ఐ వీర శేఖర్ అన్నారు. శనివారం మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ మాదకద్రవ్యాల దురాలవాట్లు అక్రమ రవాణ వ్యతిరేక దినం సందర్భంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలు వాటిని అరికట్టడంలో యువత యొక్క పాత్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీర శేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏదైతే సాధించాలనుకున్నారో ఆ దిశగా అడుగులు వేయాలంటే శ్రమ పట్టుదలతో ఇష్టపడి చదువుకోవాలన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాదని ఉన్నత స్థానంలో ఉన్న అనేక మంది ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అబ్దుల్ కలాంకు నివాళి

మిర్యాలగూడ అర్బన్ : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం పట్టణంలోని నేతాజీ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కరస్పాండెంట్ శ్రీపతి శ్రీనివాస్ కలాం జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కలాం జీవితాన్ని నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చేగొండి మురళియాదవ్, బీసీ సంఘం మహిళా జిల్లా కార్యదర్శి బంటు కవిత, ఉపాధ్యాయులు సూరి, అలివేలు, సునీత, జబీనా, కళ్యాణి తదితరులున్నారు.

తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బదిలీ


బదిలీ అయిన సిబ్బందిని సన్మానిస్తున్న తహసీల్దార్

నిడమనూరు : తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ రషీద్, గిర్దావర్ సునీత, సీనియర్ సహాయకుడు సైదానాయక్, జూనియర్ సహాయకుడు వంశీకృష్ణ, అటెండర్ వెంకటమ్మ, గోవిందమ్మలను బదిలీ చేస్తూ కలెక్టర్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందిన వెంటనే బదిలీ అయిన వారు అందరికీ తహసీల్దార్ కృష్ణయ్య వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీ అయిన వారు అందరూ శనివారం వారి వారి కార్యాలయాల్లో జాయిన్ అయ్యారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్యతో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న యువకులు

చింతపల్లి : మండల కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎన్‌సీసీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో యువకులు కలెక్టర్ నారాయణరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. అలాగే మండల కేంద్రానికి చెందిన వికలాంగుడు కడారి దశరథ సదరం సర్టిఫికెట్ అందించాలని విన్నవించాడు.

తెలంగాణ వైతాళికుడు ప్రొఫెసర్ జయశంకర్


సెమినార్ కరపత్రం ఆవిష్కరిస్తున్న హరికృష్ణ, తదితరులు

మిర్యాలగూడ : స్వరాష్ట్ర లక్ష్యాన్ని తీరం చేర్చిన తెలంగాణ వైతాళికుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు బెల్లంకొండ హరికృష్ణ అన్నారు. ఈనెల 28న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే జయశంకర్ స్మారకోపన్యాస సెమినార్ కరపత్రాన్ని ఆయన విజేత డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సమాజానికి మార్గదర్శిగా నిలిచిన వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, శ్రీనివాసచారి, దుర్గయ్య, ప్రభాకర్, రాంరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెస్టివల్ పోటీలకు ఎంపిక


అర్హత సర్టిఫికెట్ అందుకుంటున్న సంధ్య

నిడమనూరు : సకురా రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెస్టివల్ పోటీలకు నిడమనూరు మోడల్ స్కూల్ విద్యార్థిని చెన్నబోయిన సంధ్య ఎంపికైనట్లు ప్రినిపాల్ రంజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ డైట్ కళాశాలలో శనివారం నిర్వహించిన పోటీల్లో మోడల్ స్కూల్‌లో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చెన్నబోయిన సంధ్య ప్రథమ స్థానం, ఐతబోయిన మేఘన ద్వితీయ స్థానం సాధించారు. ఇందులో ప్రథమ స్థానం సాధించిన సంధ్య ఈనెల 30 హైదరాబాద్ ఎస్‌ఈఆర్‌టీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ పోటీల్లో 33మంది విద్యార్థులు పాల్గొనను న్నారు. ఈ పోటీల్లో మొదటి ఐదుస్థానాల్లో నిలిచిన వారు 2024 నవంబర్ 10నుంచి 16వ తేదీ వరకు జపాన్‌లో నిర్వహించే సైన్స్ ఫెస్టివల్ పోటీలకు అర్హత సాధిస్తారు. ప్రతిభ చూపిన, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చెన్నబోయిన సంధ్యను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లోగిశెట్టి రంజిత, అధ్యాపక బృందం అభినందించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నల్లగొండ క్రైం : పట్టణంలోని ప్రతికాలనీలో నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో పలువురు కౌన్సిలర్లు, ఇతర నాయకులు, వ్యాపారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణ, ఆకతాయిల వేధింపులు, గంజాయి, మద్యంతాగి కాలనీల్లో అసభ్యకరంగా ప్రవర్తించే, బైక్ రైడింగ్‌లు చేసేవారిని కట్టడి చేసేందుకు ఉపయోగపడతాయన్నారు. అన్ని కాలనీల్లో ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీఐ డానియెల్, రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు, పలువురు కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలపై న్యాయవాదులంతా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని హైకోర్టు న్యాయవాది వంశీధర్‌రెడ్డి, ఆంధ్ర మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లక్ష్మి, కేశవ మెమోరియల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అన్నారు. శనివారం పట్టణంలోని స్టే ఇన్ హోటల్‌లో న్యాయవాద పరిషత్ నల్లగొండ శాఖ ఆధ్వర్యంలో నూతన చట్టాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో వారు పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ కాలం నుంచి అమలులో ఉన్న కొన్ని చట్టాలను మారుస్తూ నూతన న్యాయ సంహిత గురించి న్యాయవాదులు అటు ప్రజలు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐపీసీ ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లలో తీసుకువచ్చిన మార్పులను కచ్చితంగా తెలుసుకోవాల్సిన అవసరాన్ని ఆవశ్యకతను వివరించారు. నూతన న్యాయచట్టాలపై పలువురు న్యాయవాదులు అడిగిన సందేహాలను వారు సమాధానాలు ఇచ్చారు. నూతన న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో భారత శిక్షాస్మృతి నూతన విధానాల పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పడడం ద్వారా న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో న్యాయవాద పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సోమసాని సునీల్, కోశాధికారి మంగులాల్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మేరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కట్ట సూర్య సంపత్ మురళీధర్‌రావు, రామ్‌రెడ్డి, యాదగిరి, నరసింహారెడ్డి, రఘుపతి, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, అంజిరెడ్డి, పాల్గొన్నారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్


వివరాలు తెలుపుతున్న ఎస్ఐ

కొండమల్లేపల్లి : సెంట్రింగ్ సామగ్రి చోరీ చేసిన వ్యక్తిని కొండమల్లేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి శనివారం పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు. శనివారం కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడ వైపు నుంచి సెంట్రింగ్ బాక్సులతో కూడిన ఆటో ట్రాలీ అతి వేగంగా కొండమల్లేపల్లి వైపునకువస్తుంగా పోలీసులు అనుమానం వచ్చి తనిఖీ చేయగా సైదాబాద్‌లోని సింగరేణి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ వడ్త్య చిన్న తప్పించుకునేందుకు యత్నం చేయగా పోలీసులు పట్టుకొని విచారించారు. ఈ క్రమంలో సుమారు రూ.1.50లక్షల విలువైన సెంట్రింగ్ సామగ్రి, ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ ధనుంజయ్య, ఎస్ఐ రామ్మూర్తి, హెడ్ కానిస్టేబుల్ జగన్, కానిస్టేబుల్ రాము, భాస్కర్, హేమూనాయక్, హోంగార్డ్ మల్లిఖార్జున్‌లను దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీచర్లు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వెళ్లిన అన్నబీమోజు కొదండరామ శ్రీధర్, ఆశాసిద్ధిక, కరుణాకర్‌రెడ్డిలను పాఠశాల ఉపాధ్యాయ బృందం శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం నక్క శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగికి బదిలీ అనేది సర్వసాధారణమన్నారు. ఉత్తమంగా బోధించి అందరి మన్ననలు పొందినప్పుడే ఉపాధ్యాయులుగా గౌరవింపబడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనందగిరి తదితరులు ఉన్నారు.

జవాన్ మృతికి సీపీఎం సంతాపం

నల్లగొండ టౌన్ : జిల్లాకు చెందిన ఈరటి మహేష్ అస్సాం రాష్ట్రంలో ఆర్మీ జవాన్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందడంపై సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మహేష్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన మృతి దేశానికి, రాష్ట్రానికి, కుటుంబానికి తీరనిలోటన్నారు.

మంత్రిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

నల్లగొండ : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు అన్నారు. అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డిపై హరీష్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం పట్టణంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. హరీష్‌రావు మంత్రి కోమటిరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటి, యూత్ కాంగ్రెస్ నాయకులు అనిల్, జహంగీర్‌బాబా, నాగార్జున, ప్రసాద్, సాయిరాం, వంశీ, నందిని, రంజిత్, హనీఫ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే


మిర్యాలగూడ టౌన్ : ఈదులగూడెంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది


నాగార్జున సాగర్ : హిల్‌కాలనీలో జ్వర సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని అన్ని వార్డులో చేపట్టిన ఇంటింటి జ్వర సర్వే కార్యక్రమం వైద్య, మెప్మా, శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే శనివారం రెండో రోజుకు చేరింది. ఈ సర్వేలో వివిధ అంశాలు ప్రజల నుంచి అడిగి తెలుసుకుంటున్నారు. ఇంటింటి సర్వేను 4, 5వ వార్డు కౌన్సిలర్లు చల్లా నాగమ్మవెంకన్న, ముదిరెడ్డి నర్సిరెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు నవ్య, శ్రవంతి, అంగన్‌వాడీ టీచరు బొండు పార్వతి, ఆర్‌పి. ఝాన్సీతో పాటు పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ దండు శ్రీను ఆధ్వర్యంలో కాలనీల్లో ఇంటింటికి జ్వర సర్వే నిర్వహిస్తున్నారు. 12వార్డుల్లో పూర్తిస్థాయిలో సర్వే మొదలైంది. శనివారం హిల్‌కాలనీలో అంగన్‌వాడీ వర్కర్లు, సీఆర్‌పీలు, మున్సిపాలిటీ సూపర్‌వైజర్లు జ్వర సర్వే బృందాలుగా విడిపోయి సర్వే చేశారు. ప్రతి బృందం 50గృహాలు కవర్ చేసేందుకు ప్లాన్ చేసుకున్నారు. మొదటగా జ్వర పీడితులను గుర్తించ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపుతున్నారు. సర్వేలో ఆంగన్వాడీ వర్కర్ రాజేశ్వరి, సూపర్‌వైజర్ నిరంజన్ ఉన్నారు.

పెన్షనర్ల మౌనదీక్షను జయప్రదం చేయాలి

నల్లగొండ టూటౌన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పెన్షనర్లు చేపట్టనున్న మౌనదీక్షను జయప్రదం చేయాలని ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ జిల్లా కన్వీనర్ పందిరి శ్యాంసుందర్ కోరారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా నాలుగు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని, ఆరోగ్య పథకం ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, ఐఆర్ 5శాతం నుంచి 20శాతం వరకు పెంచాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షనరీ బెనిఫిట్స్‌కు అవకాశం కలిపించాలనే డిమాండ్‌తో మౌనదీక్ష చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో టప్రా జిల్లా అధ్యక్షుడు జగదీష్‌చంద్ర, జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, అబ్దుల్‌ఖాదర్, పాదూరి విద్యాసాగర్‌రెడ్డి, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, గుండాల భిక్షమయ్య, చిలుక సోమయ్య, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత


సరుకులు, సైకిల్ అందజేస్తున్న సభ్యులు

కొండమల్లేపల్లి : మండలంలోని కొత్తబావి గ్రామానికి చెందిన దోమల సత్తయ్య, పద్మ దంపతులు ఇటీవల మృతి చెందారు. శనివారం వారి పిల్లలు పార్వతమ్మ, పావని, వెంకటమ్మకలు రిషిసంస్కృతి విద్యా కేంద్రం(ఎస్ఎస్‌వై) బెంగళూరు సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, వెంకటమ్మకు సైకిల్ అదజేశారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, అలుగుబెల్లి నాగార్జునరెడ్డి, గాయత్రిపరివార్, వింజమూరి చంద్రమౌళి, సత్యనారాయణ, జగదీష్, అలుగుల సాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, యాదగిరి, రవీరందర్‌రెడ్డి, బొడ్డుపల్లి ధనమ్మ, దూదిమెట్ల యాదగిరి, కుందారపు సాయి, రమేష్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రీన్ డే



గ్రీన్ దుస్తులు ధరించిన విద్యార్థులు

హాలియా : పట్టణంలోని న్యూకిడ్స్ స్కూల్‌లో శనివారం గ్రీన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా గ్రీన్ దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. గ్రీన్ డే సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మనాది శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌పై డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 7.3శాతం బడ్జెట్ కేటాయించటాన్ని నిరసిస్తూ పట్టణంలోని గడియారం సెంటర్‌లో శనివారం డీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ అధ్యక్షుడు ఎం.సోమయ్య మాట్లాడుతూ.. 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.విజయ్‌కుమార్, కాశయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు

కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిర్యాలగూడ మున్సిపాలిటీలోని కుక్కలను పట్టుకొని స్టిరిలైజ్, రాబిస్ రోగ నిరోధక టీకాలు ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌యూసుఫ్ తెలిపారు. . శనివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో 2351 కుక్కలను గుర్తించినట్లు తెలిపారు. త్వరలో వాటిని పట్టుకొని నల్లగొండలోని ఎనిమల్ కేర్ సెంటర్‌లో స్టీరిలైజేషన్ చేయించి, యాంటీ రాబీస్ ఇంజక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తిరిగి తీసుకొచ్చి పెంపుడు కుక్కలను యజమానులకు, అదే విధంగా వీధి కుక్కలను వీధుల్లో వదులుతామన్నారు.

వీధులు బురదమయం




మిర్యాలగూడ : చిన్నపాటి వర్షానికే కాలనీ మొత్తం అస్తవ్యస్తంగా మారి ప్రజలు నడవలేని పరిస్థితిలో ఉన్నారని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రవీందర్‌నగర్ కాలనీలో చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారి నడవలేని దుస్థితి నెలకొంది. ఈ కాలనీ ఏర్పాటు చేసి కూడా దాదాపు 15 ఏండ్లు కావొస్తున్నప్పటికీ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా చెరువులను తలపిస్తున్నాయి. ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.